# అసలు సమస్య

(జాగృతి)

శ్రీలంకలో మారణకాండకూ —
పంజాబులో అల్లర్లకూ —
ఇరాన్, ఇరాక్ యుద్ధ జ్వాలలకూ —
ఎంతో స్పందించిపోయే మనం,
మన స్వంత సమస్యలకు —
మనచుట్టూ జరిగే దారుణాలకూ ఎందుకు
స్పందించం ?

# అసలు సమస్య

వీధి గది కిటికీ తలుపులు తెరిచేను.

ఉదయం ఎనిమిది గంటలకే ఎండ కర కర లాడుతోంది.

మా వీధి గదికి అవతలివైపున రేషన్ షాపు వుంది.

రేషను తీసుకునేందుకు అప్పుడే చాలామంది కొట్టు ఆరుగు మీదకు చేరారు.

ఎనిమిదిన్నర దాటితేగానీ షాపు యజమాని తలుపులు తెరవడు! రేషను ఇవ్వడు!

అయినా, అప్పుడే చాలామంది అక్కడకు చేరి ఖాళీ సంచులు, సిల్వర్ కేరియర్లు, రుమాళ్ళు, గోనెసంచులు ఇలా ఎవరికి అందుబాటులో వున్న వస్తువులతో వాళ్ళు 'క్యూ' ఏర్పరిచేరు.

వచ్చిన వాళ్ళలో పురుషులందరూ ఒక ప్రక్కకు చేరారు.

ఎవరికి తోచిన కబుర్లు వాళ్ళు ఆరంభించేరు.

గెడ్డం గీసుకుంటూ వారి మాటలు వినటం ఆరంభించేను.

అక్కడ చేరిన మనుషుల్లో చాలామంది నాకు తెలిసినవాళ్ళే!

రైల్వే ఆఫీసులో గుమాస్తాలు —

రిటైరయిపోయిన బడిపంతుళ్ళు —

కాలేజీ కుర్రాళ్ళు —

తీసేసిన కానిస్టేబిలు —

తాలూకాఫీసులో వాచ్ మేన్ —

ఛోటా కంట్రాక్టర్లు —

ఇలా అన్ని తరగతులవారూ అందులో వున్నారు.

పోను పోను వాళ్ళ మాటలు, వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారటంతో మరింత శ్రద్ధగా వినటం మొదలెట్టేను.

"…. శ్రీలంకలో తమిళులను ఊచకోత కోసేస్తూవుంటే మన ప్రభుత్వం ఇలా చూస్తూ ఊరుకోవటం ఏమీ బాగాలేదు …."

"…. ఊరుకోక ఏం చేస్తారు?"

"ఎందుకు ఊరుకోవాలి?…."

"అది వారి అంతరంగ సమస్య కాబట్టి…."

"అప్పట్లో బంగ్లాదేశ్ వాళ్ళది వాళ్ళ అంతరంగ సమస్యే…. మరి మనం ఊరుకున్నామా? …. ఉరెట్టుకుని కాందిశీకుల్ని రప్పించు కున్నాం…. ఉత్తరం ముక్క రాస్తే చాలు, అయిదేసి పైసలు వాళ్ళకి చెల్లించేం…. నెత్తికెక్కించుకుంటే…. ఆఖరికి ఏమయింది? …. విమోచన కలుగజేసినందులకు మనకే మేకయింది …."

"తమిళులు మాత్రం తక్కువ్వాళ్ళా? …. వేరే దేశం కావాలంటే ఎవరొప్పుకుంటారు? …. తరువాత ఇక్కడ కూడా ద్రవిడ దేశం కావాలంటారు …."

"పంజాబు సంగతి ఎవ్వరూ మాట్లాడరేం? …. అక్కడ గుండాలు, తీవ్రవాదులు అమాయకుల్ని చంపేస్తున్నారు …. ముందు పంజాబు సంగతి ఆలోచించాలి…. అది చూడండి …."

"అన్యాయం ఎక్కడ జరిగినా ప్రతిఘటించాల్సిందే…. మరి"

"మీ అబ్బాయి మార్కులలిస్టులు ఏదో అన్యాయం జరిగిపోయిం దన్నారు…. దాని సంగతేమిటి?"

"అది కంప్యూటరు తప్పట!…."

"కంప్యూటర్లు తప్పులు చేయవు…. మనం ఫీడింగు సరిగ్గా ఇస్తే ఫలితాలు సరిగ్గా ఇస్తాయి…. మన తప్పుల్ని కంప్యూటర్ల మీదకి నెట్టటం న్యాయంకాదు…."

"న్యాయం ఎక్కడుందయ్యా బాబూ ఈ రోజుల్లో…."

"అది సరే…. అస్సాం సమస్య చల్లారిపోయినట్లే, పంజాబు సమస్య కూడా అణిగిపోతుంది…."

"సమస్య ఎప్పుడో అణిగిపోతుంది…. బాగానే వుంది…. ఈ

లోగా చచ్చిపోయే జనం సంగతి ఏమిటి? అమాయకులు అలా బలి కావల్సిందేనా?"

"హైదరాబాదు అల్లర్ల సంగతి ఎవ్వరూ మాట్లాడరేం?"

"అవును.... అదీ నిజమే!"

"ఏది నిజం?"

"అదే.... హైదరాబాదులో సమస్య ఘోరంగా వుంటే.... పంజాబు, అస్సాములు మనకేల?.... ముందు ఈ మత కలహాలకు పరిష్కార మార్గం వెదకాలి?"

"అయ్యో! ఎక్కడో హైదరాబాదు సంగతి కాదు.... ముందు మన వూళ్ళో జరిగే అన్యాయాల గురించి ఎవ్వరూ పెదవి విప్పరేం?"

"ఎక్కడండోయ్.... చెప్పేరు కాదేం?...."

"అయ్యో.... మన ఊరి స్టీలు ప్లాంటులో ఉద్యోగాల సంగతి! ఉద్యోగాలన్నీ బయటవాళ్ళకే ఇస్తున్నారట! మా అబ్బాయి మూడుసార్లు ఇంటర్వ్యూకి వెళ్ళేడు. ఆఖరికి ఎవరో బొకారో ప్లాంటులో పనిచేసిన వాడికి ఇచ్చేశారు ఆ ఉద్యోగాన్ని. అడిగే నాధుడు లేడు!"

"దీనికి తుపాకీగుళ్ళు తప్ప వేరే పరిష్కారం లేదు...."

"ఎవరి తుపాకులు? పోలీసులవా? ప్రజలవా?"

"అన్యాయాన్ని ఎదిరించకపోతే లాభంలేదు...."

"అరాచకత్వం ఎక్కడ వున్నా ఖండించవలసిందే...."

"అధర్మం ఎక్కడ జరిగినా నిరసన తెలియజెయ్యాలి... లేకపోతే ఈ దేశం బాగుపడదు!"

రక రకాల వ్యాఖ్యానాలతో —

పలు రకాల హెచ్చరికలతో —

అనేక రకాల వేడివేడి పదజాలంతో —

వాడిగా సాగిపోతోంది వాళ్ళ సంభాషణ!

అంతలోనే షాపు యజమాని వచ్చేడు.

జేబులోంచి గుత్తి తీసి తలుపులు తెరిచేడు.

వ్యాఖ్యానాలు ఆగిపోయాయి!

అందరూ క్యూలో సర్దుకున్నారు బిలబిల్లాడుతూ.

ధర్మదేవతను తీసుకువచ్చి ఉరేసినట్లు—

తూచే పెద్ద కాటాను తీసుకువచ్చి, బయట వరండాలో దూలానికి తాడుతో వేలాడదీశాడు షాపులో పనిచేసే కుర్రాడు. తరువాత లోపలి నుండి పంచదార మూటను బయటకు తరలించి, మూతవిప్పి, గోనె సంచీ వెనక్కి నొక్కి మడిచిపెట్టి సిద్ధం చేసుకున్నాడు.

ఓ టేబిలు, కుర్చీ తెచ్చి యజమానికోసం వేశాడు.

కార్డు తీసుకుని అందులో సంతకంచేసి, తర్వాత తనబిల్లు బుక్కులో రాసి బిల్లులు కట్ చేయటం ఆరంభించేడు షాపు యజమాని.

అంతా యాంత్రికంగా జరుగుతోంది.

పంచదార పంపిణీ ఆరంభమయింది.

"మళ్ళీ ఆ గుండే బయటకు తీశేవా నాయనా--"

"దానితో తూస్తే వందగ్రాములు తక్కువొస్తోంది--"

"ఆ కన్నాలున్న గుండుతో తూచకయ్యా బాబూ—" ఈ సారి కాస్త స్వరంపెంచి అన్నారు రిటైర్డ్ తాసిల్దారుగారు.

"నిజమే....క్రితంసారి మళ్ళీ బజారులో తూపిస్తే రెండు కేజీలకూ రెండు వందల గ్రాములు తక్కువయింది"

కాలేజీ కుర్రాడు అందుకున్నాడు.

"నిన్నేనయ్యా....వద్దంటూవుంటే, మళ్ళీ ఆ గుండే వేస్తావేం ?"

ఓ గుమాస్తా పనివాడిమీద విరుచుకు పడ్డాడు.

ఆ పనివాడు షాపు యజమానివంక చూసేడు.

యజమాని మాత్రం నిమ్మకు నీరెత్తినట్లువున్నాడు.

తనపని తాను చేసుకుంటున్నాడు.

ఈ మాటలు ఏవీ తన చెవిలో పడనట్లు ఊరుకున్నాడు.

"రిటైర్డ్ టీచరు అతడి దగ్గిరగా వెళ్ళి మీరే !.... ఏం మాట్లాడరేం ?.... ఆ గుండు తొమ్మిదివందల గ్రాములే.... కేజీకాదు...." అన్నాడు ఆవేశంగా.

షాపుయజమాని తాపీగా తలఎత్తేడు.

నిదానంగా అందరివంకా చూసేడు.

"ఆ గుండు తోపే తూస్తాం .... కావాలంటే తీసుకువెళ్ళండి ! లేదా వెళ్ళి రిపోర్టు చేసుకోండి .... మీ ఇష్టం .... ఇంతకీ పంచదార కావాలా ? అక్కరలేదా ?" అన్నాడు అతినిర్లక్ష్యంగా.

ఆ సమాధానానికి—

ఆ ఘోరమయిన ధోరణికి—

ఆ బాధ్యతలేని మాటలకు—

ఈ చైతన్యవంతులందరూ కలిసి షాపుయజమానిని రోడ్డుమీదకు లాగి, చితక్కొట్టి, కాలువలోకి తోసేస్తారేమోనని భయం వేసింది.

పెద్ద యుద్ధకాండ జరిగి పోతుందనుకున్నాను !

ఆ పొగరుమోతు సమాధానంతో ఒళ్ళు మండిపోయి, కాటాగుళ్ళు అవతలకు విసిరేస్తారేమోననుకున్నాను. ఆ జవాబుకు వెర్రెక్కిపోయి యజమాని గల్లాపెట్టె చితక్కొడతారేమో నని కూడా భయపడ్డాను !!

కానీ—

ఆశ్చర్యం ! ఏమీ కాలేదు !!

అతడికి సమాధానంగా ఎవ్వరూ గట్టిగా మాట్లాడలేదు.

గొణుక్కుంటూ, పంచదార తీసుకొని ఒకరి వెనుక మరొకరు వెళ్ళిపోయారు !!

శ్రీలంకలో అల్లర్లకూ—

పంజాబులో మారణ హోమానికీ—

అస్సాంలో విజాతీయ సమస్యకూ—

హైదరాబాద్‌లో మత కల్లోలాలకు —

స్టీలుప్లాంటులో ఉద్యోగ సమస్యలకూ—

స్పందించిపోయే ఈ వ్యక్తులు, తమ స్వంతానికి జరుగుతున్న అన్యాయానికి ఎందుకు స్పందించటం లేదు ???

ఎందుకని ??

నేను విస్తు పోయి, చూస్తూ నిలబడి పోయాను కిటికీ దగ్గరే !